క్లుప్తంగా

నేటి నుంచి 'గడప గడపకు'

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లెలో శనివారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారన్నారు. ముందుగా అప్పినపల్లె, కుంబార్లపల్లెలో జరుగుతుందని, ఆదివారం నాడు చినపరెడ్డిపల్లె, దొమ్మరిపాళ్యం, దెయ్యాల గడ్డలో కొనసాగుతుందని వివరించారు.

వెండి ఆభరణం వితరణ


వెండి ఆభరణం అందిస్తున్న దాతలు

సదుం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారికి దాతలు బత్తులూరి వెంకటరమణ, సుందరమ్మ శుక్రవారం రూ.30వేల విలువైన వెండి ఆభరణాన్ని వితరణగా అందించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించినట్లు వెల్లడించారు.

నేడు కంటి వైద్య శిబిరం

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి సచివాలయం వద్ద శనివారం మదనపల్లె ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జయసుధమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 నుంచి 2 గంటలకు వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు వెల్లడించారు.

మాదకద్రవ్యాలపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు

సోమల: ఎస్‌కేవీస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. అందులో భాగంగా 14500 టోల్‌ఫ్రీ నంబర్ ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి జయరామ్, అధ్యాపకుడు బట్టు శివయ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి


ట్యాంకును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

బైరెడ్డిపల్లె: పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ లక్ష్మి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తీర్థం గ్రామంలో ఆమె పర్యటించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలన్నారు. మురుగు నీటి కాలువలు, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో మారెమ్మతల్లి

పుంగనూరు: పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని పత్తితో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చలిపిండి, చల్ల ముద్దతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

హ్యూమన్ రైట్స్ మీడియా సెక్రటరీగా సుభాన్



పలమనేరు: వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా మీడియా సెక్రటరీగా పలమనేరుకు చెందిన సుభాన్ నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షుడు అన్సారీ నియామక పత్రం పంపించారు.

ప్రజలకు సకాలంలో సేవలు

- శ్రీవారి భక్తుల కోసం సప్తగిరి బస్సులు
- తిరుమలకు రెండు సర్వీసులు ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి


బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి


జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సకాలంలో సేవలందిస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి తిరుమలకు నూతనంగా రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుంగనూరులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని వెల్లడించారు. ఈ డిపో నుంచి అన్ని ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నామని వివరించారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే వారికి టికెట్ బుక్ చేసుకునే సదుపాయం కూడా కల్పించామని చెప్పారు. పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు జితేంద్రరెడ్డి, సుధాకరయ్య, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జానపదకళల సంస్థ అధ్యక్షుడు కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఫకృద్దీన్ షరీఫ్ పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సెంటర్‌కు భూమి పూజ


భూమి పూజలో ఎంపీపీ యువరాజు

వి.కోట: స్థానిక వ్యవసాయ కేంద్రంలో అగ్రి ఇన్‌పుట్ సెంటర్ నిర్మాణానికి ఎంపీపీ యువరాజు శుక్రవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సహకారంతో అగ్రి ఇన్‌పుట్ సెంటర్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఈ సెంటర్ ద్వారా రైతులకు సరసమైన ధరలకే ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు అందుతాయన్నారు. సుమారు 1,200 మంది రైతులకు ఈ కేంద్రం నుంచి సేవలందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ ఏపీఎమ్ఏఎస్ రఘుపతినాయుడు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సచివాలయ ఉద్యోగులకు, అధికారులకు బాల్యవివాహాల నివారణపై ఎంపీపీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీమ్‌ఖాన్, సింగిల్‌విండో చైర్మన్ ధవనం భక్త, నాయకులు భూపతి, బాబు, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీధిలో నీటి నిల్వల తొలగింపు


నీటి నిల్వ తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పలమనేరు: పట్టణ సమీపంలోని శికారీ కాలనీలో శుక్రవారం డ్రై డే సందర్భంగా ఇళ్ల ముందు నిల్వ చేరిన నీటి తొలగింపునకు మలేరియా సబ్ యూనిట్ అధికారి జయశంకర్ చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నిల్వ చేరిన నీటి వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని, ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది అరుణ, భాగ్యమ్మ, రజియా పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్లలో శ్మశాన స్థలం ఆక్రమణపై తహసీల్దార్ కుమారస్వామికి శుక్రవారం స్థానిక ముస్లింలు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సుమారు 130 కుటుంబాల ముస్లింలు ఉన్నామని, తమ కోసం 613–2 సర్వే నంబర్‌లో 1.5 ఎకరాలను శ్మశాన వాటిక నిమిత్తం ప్రభుత్వం కేటాయించిందన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంత మంది ఆ స్థలాన్ని ఆక్రమించుకొని షెడ్డు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

పాఠశాలల తనిఖీ


మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: మండలంలోని కొత్తపేట, లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ లీలారాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల హాజరు 95శాతం ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలకు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలని సూచించారు.

మాదకద్రవ్యాలు వాడితే అనర్థమే


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్‌బాబు

పలమనేరు: మాదకద్రవ్యాలు వినియోగిస్తే అనర్థాలు తప్పవని డిగ్రీ కళాశాల అధ్యాపకుడు వెంకటేష్ బాబు హెచ్చరించారు. శుక్రవారం కళాశాలలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని తెలిపారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ ఉత్తమ పౌరులుగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, అధ్యాపకులు చిదంబరం, జయచంద్రుడు, జయశంకర్ పాల్గొన్నారు.


క్రీడా దుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు క్రీడాదుస్తులు

పెద్దపంజాణి: రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలకు ఎంపికైన నిడిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టుకు వైఎస్సార్‌సీపీ స్థానిక నేత పవన్ సాయి క్రీడా దుస్తులను శుక్రవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నౌషాద్ పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

సోమల: అదనపు కట్నం తీసుకురావాలంటూ అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ పోలీసులను శుక్రవారం ఆశ్రయించింది. వివరాలు.. దిడ్డివారిపల్లెకు చెందిన రామచంద్రయ్య, శకుంతల కుమార్తె సరితను తిరుపతికి చెందిన వెంకటరమణ, కుమారీ దంపతుల కుమారుడు బాలాజీకి ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో ఇటీవల భర్త, అత్తామామలు అదనంగా రూ.10లక్షలు తీసుకురావాలని కొట్టి బయటకు గెంటేసినట్లు బాధితురాలు వెల్లడించింది. గ్రామ పెద్దలు ఎన్నిసార్లు పంచాయితీ చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయింది. పోలీసులే తనకు న్యాయం చేయాలని పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

27న ధర్మకర్తల మండలి సమావేశం

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 27న శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మండలి సభ్యులు, ఆలయ అధికారులు హాజరు కావాలని కోరారు.

పోలీస్ మాక్ టెస్ట్‌కు స్పందన

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కుట్టి కోచింగ్ సెంటర్ వారు శుక్రవారం నిర్వహించిన ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల మాక్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. నిర్వాహకురాలు పవనకుమారి మాట్లాడుతూ లక్ష్మణ్ 114 మార్కులతో మొదటి స్థానం, సయ్యద్ సమీవుల్లా 112 మార్కులతో రెండవ స్థానం లో నిలిచారని చెప్పారు.

బాధ్యతగా రహదారి భద్రత


సమావేశానికి హాజరైన డ్రైవర్లు


మాట్లాడుతున్న ఎంవీఐ మధుసూదన్

పలమనేరు: రహదారి భద్రత నియమాలను పాటించడం అందరి బాధ్యతని ఎంవీఐ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రవాణాశాఖ కార్యాలయంలో 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల బస్సు డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. పరిమితికి మించి ఆటోల్లో పిల్లలను ఎక్కించకూడదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. విద్యావంతులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు పర్యాయాలకు మించి రూల్స్ అతిక్రమించి పట్టుబడితే లైసెన్స్ పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బైక్‌పై హెల్మెట్ , కారులో సీట్‌బెల్ట్ కచ్చితంగా ధరించాల్సిందేనన్నారు. కొత్త రూల్స్ ప్రకారం ఎటువంటి రికార్డులు లేని వాహనాలకు సంబంధించి అన్ని జరిమానాలు కలిపి రూ.10 వేలు దాటుతుందని వివరించారు. కార్యక్రమంలో గంగవరం సీఐ అశోక్ కుమార్, పలమనేరు ఎస్ఐ నాగరాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటించాలి

రహదారి భద్రతా నియమాలను డ్రైవర్లు విధిగా పాటించాలని ఎంవీఐలు ఆంజినేయప్రసాద్, భూషణ్‌రెడ్డి ఆదేశించారు. క్యాటిల్ ఫామ్ వద్ద రోడ్డుపై వాహనాలను నిలిపి డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాక్టర్ ట్రాలర్ వెనుక రేడియం స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు దీపిక, హరికిశోర్ పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

వి.కోట: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఎంవీఐ మధుసూదన్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా రవాణాశాఖ ద్వారా బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు


లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: రాష్ట్రంలో అభివృద్ధిని ఓర్వలేకే ప్రభుత్వంపై కొందరు అసత్య ఆరోపణలతో విమర్శలు గుప్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శుక్రవారం 64 పెద్దూరు పంచాయతీ సోలిశెట్టిపల్లె, జోగిండ్లు, కారిముట్ల, గెసికపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు మాత్రమే లబ్ధిపొందారన్నారు. తనకు ఓటేసిన వారికి మాత్రమే పథకాలు అందిస్తామని అప్పట్లో చంద్రబాబు చెబితే, ఇప్పుడు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని వివరించారు. ప్రజలకు సక్రమంగా పథకాలు అందుతున్నాయా అనే విషయం తెలుసుకునేందుకే గడప గడపకు కార్యక్రమం రూపొందించినట్లు వెల్లడించారు. పేదల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ నేతలు, పచ్చ మీడియాతో కలిసి విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కరోనా విపత్తు సమయంలో చంద్రబాబు, లోకేష్ పొరుగు రాష్ట్రంలో దాక్కుంటే, ప్రజలకు సేవలదించింది వలంటీర్లే అని గుర్తు చేశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ క్షుద్ర రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్ష నేతలకు 2024 ఎన్నికల్లో జనాలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీడీఓ హేమమాలిని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నేతలు కోదండరెడ్డి, శంకర్‌రెడ్డి, వీరభద్రప్ప, వెంకేశు, చంద్రశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు నిసార్, సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు యువరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో కార్మికులకు అన్యాయం


మాట్లాడుతున్న సీపీఎం నేత సుబ్బారావు

పలమనేరు: కేంద్రంలోని బీజేపీ పాలనతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని సీపీఎం నేత దడాల సుబ్బారావు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కారణంగా అసంఘటిత రంగం కకావికలమైందన్నారు. రైతులకు సైతం గిట్టుబాటు ధర దక్కడం లేదని విమర్శించారు. కాషాయ దండును గద్దె దింపేందుకు విపక్షాలు ఏకం కావడం హర్షణీయమని తెలిపారు. సమావేశంలో స్థానిక నేతలు గిరిధర్‌గుప్తా, వాడ గంగరాజు, సురేంద్ర, ఓబులురాజు, భువనేశ్వరి పాల్గొన్నారు.

యూనిఫామ్ తప్పనిసరి


రికార్డు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి

సోమల: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించి విధులకు హాజరు కావాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని ఇరికిపెంట సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. బయోమెట్రిక్ ఆధారంగానే వేతనం చెల్లింస్తామని తెలిపారు. వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాని, మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ బాబు, పంచాయతీ కార్యదర్శి మేనక పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ఆదాయం రూ.21.16 లక్షలు

- జిల్లా వ్యాప్తంగా 63 ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆర్టీసీ వివిధ ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.21.16లక్షల ఆదాయం గడించింది. ఈ నెల 10 నుంచి 19 వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. చిత్తూరు నుంచి ప్రత్యేక బెంగుళూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు మొత్తం ఐదు డిపోల నుంచి పదిరోజులుగా 63 సర్వీసులను నడిపారు. ఈ బస్సులు 46,432 కిలోమీటర్లు తిరిగితే 4,618 మంది ప్రయాణికులు ప్రయాణించారు. ఈ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలనే వసూలు చేయడం, ముందుగానే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌ను పెద్దగా ఎవరూ ఆశ్రయించలేదు. ఆర్టీసీ సర్వీసులనే ఎక్కువగా సద్వినియోగం చేసుకున్నట్టు ఆదాయం చెప్పకనే చెప్పింది.

ఆక్రమణ తొలగింపు

చిత్తూరు అర్బన్: నగరంలోని గంగినేని చెరువు వద్ద స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మిస్తున్నట్టు కమిషనర్ అరుణకు ఫిర్యాదు అందడంతో ఆమె స్పందించారు. ఆమె ఆదేశాలతో శుక్రవారం గంగినేని చెరువు వద్ద షెడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణుడు ఆక్రమణ నిజమేనని తేల్చారు. షెడ్డు వేస్తున్న వ్యక్తుల వద్ద ఎలాంటి రికార్డులు లేకపోవడంతో షెడ్డును తొలగించారు. అధికారులు మురళీకృష్ణ, జాకీర్ పాల్గొన్నారు.

కేంద్రాలతో 'భవిత' ఉజ్వలం



ఎంఆర్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పూతలపట్టులో..

ఐరాల: దివ్యాంగ పిల్లల ఉజ్వల భవితకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో 15మంది ప్రత్యేక ప్రతిభావంతులకు కిట్లను పంపిణీ చేసి ఎంఈఓ మాట్లాడారు. శారీరక, మానసిక లోపాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఈ కేంద్రాలలో ప్రత్యేక ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, రాజారెడ్డి, ఐఆర్టీ కవిత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని భవిత సెంటర్‌లోని శుక్రవారం 12మంది ప్రత్యేక ప్రతిభావంతులకు కిట్లను పంపిణీ చేశారు. వీటిని ఎస్‌ఐఈపిఐడి సహకారంతో, సమగ్ర శిక్షణ చిత్తూరు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది లావణ్య, సుప్రియ, రేష్మ పాల్గొన్నారు.

పౌర సేవలు మరింత విస్తృతం


సమావేశంలో కమిషనర్, ఇతర అధికారులు

చిత్తూరు అర్బన్: నగర, పురపాలక సంఘాల పరిధిలో పౌర సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్, ప్లాస్టిక్ నిషేధం, రీ సర్వే, రోడ్ల మరమ్మతుల అంశాలపై సమీక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అరుణ, ఇతర అధికారులు హాజరయ్యారు. అరుణ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అవగాహన కార్యక్రమాలతో పాటు, తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుం విధిస్తున్నట్లు చెప్పారు. జనవరి 26 తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం పై తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రీ సర్వే కార్యక్రమం కొనసాగుతుందని, ఇప్పటికే 50 వార్డుల పరిధిలో గ్రామసభలు పూర్తి చేశామని, కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. రోడ్ల మరమ్మత్తులు, పన్ను వసూలు, పురోగతి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రీ–సర్వే పక్కాగా చేపట్టాలని, క్లాప్ యూజర్ చార్జీల వసులు శాతం పెంచాలని ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు వేగంగా పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఏసీపీ రామకష్ణుడు, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.